క్లుప్తంగా

నూతన ఆర్డీవోకు నేతల అభినందనలు



నర్సీపట్నంలో నూతన ఆర్డీవోను సత్కరిస్తున్న అప్పన్న రాంబాబు

రోలుగుంట : నర్సీపట్నం నూతన ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన వి.వి.రమణను పలువురు గురువారం ఆర్డీవో చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు. వృక్షమిత్ర వ్యవస్థాపకుడు అప్పన్న రాంబాబు ఆర్డీవోను కలిసి అభినందనలు తెలిపారు.

తామరబ్బలో దోమతెరల పంపిణీ



దోమ తెరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

దేవరాపల్లి : తామరబ్బ పంచాయతీ పరిధిలోని శివారు గ్రామాలకు సైతం మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సర్పంచ్ టోకురి రామకృష్ణ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో దాదాపుగా అన్ని శివారు గ్రామాలకు తారురోడ్లు, సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ప్రజలు, అధికారుల సహాయ సహకారాలతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన దోమతెరలను సర్పంచ్ రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

కృష్ణదేవిపేట రేంజర్‌గా శ్రీనివాసరావు



బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు

గొలుగొండ : కృష్ణదేవిపేట అటవీరేంజ్ అధికారిగా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో సీలేరు రేంజ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించగా బదిలీపై ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడ పనిచేసిన వెంకటరమణ ఇతర ప్రాంతానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అటవీ సంపద పరిరక్షణకు, కలప అక్రమ రవాణాను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కాలినడకన విజయవాడకు..



కాలినడకన విజయవాడకు బయలు దేరిన భవానీ భక్తులు

గొలుగొండ: లింగంపేట గ్రామానికి చెందిన 8మంది భవానీ భక్తులు విజయవాడకు కాలినడకన బయలుదేరారు. దేవీ నవరాత్రుల సందర్భంగా గురువారం గ్రామంలో పూజల అనంతరం ఈ గ్రామంలో ఉన్న 8 మంది భక్తులు బయలుదేరారు. విజయదశమి రోజుకు విజయవాడ చేరుకుంటున్నట్టు చెప్పారు. 9 రోజుల పాటు ప్రయాణం చేయడం జరుగుతుందని భక్తులు గోవింద్, ప్రసాద్, శ్రీను తెలిపారు.

బలిఘట్టంలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి బలిఘట్టం వినాయకుడు ఆలయం వద్ద సంస్కృతి చారిటబుల్ సేవా సంఘం వారు శంకర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తమాలజిస్ట్ కె.అపర్ణాజి 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. వీరికి కొద్దిరోజుల్లో శస్త్రచికిత్స నిర్వహిస్తామని ప్రోగ్రాం మేనేజర్ అరుణ్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు భీమిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గమ్మ తల్లి

- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం
- దుర్గాదేవి అమ్మవారి విగ్రహాల ప్రతిష్ట
- గ్రామాల్లో మార్మోగిన దుర్గమ్మ శరణుఘోష
- చోడవరం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి స్వర్ణాలంకరణ



మాడుగుల : పుష్పాలు, ఆభరణాల అలంకరణలో దేవితల్లి అమ్మవారు



మాడుగుల : తొలిపూజలో పాల్గొన్న భక్తులు



కె.కోటపాడు : వారాడలో దుర్గాదేవి మండపంలో పూజలు చేస్తున్న సర్పంచ్ సౌజన్య

చోడవరం : దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఎంతో సందడిగా ప్రారంభమయ్యాయి. ఒక పక్క భవానీ మాలధారణతో భక్తుల హడావిడి , మరో పక్క నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాల ప్రతిష్టలతో వాడవాడలా గ్రామాల్లో దసరా సందడి నెలకొంది. చోడవరం దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు అమ్మవారు స్వర్ణాభరణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక్కడి అమ్మవారి నిలువెత్తు విగ్రహానికి పసుపు కొమ్ముల దండలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంతో పాటు మెయిన్‌రోడ్డు పొడవునా భారీ విద్యుదలంకరణ చేశారు. చోడవరం శ్రీస్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయంలో ఉపాలయంలో వేంచేసియున్న శ్రీగౌరీదేవి ఆలయ ప్రాంగణంలో దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహం ముందు ప్రత్యేకంగా అలంకరించిన దుర్గాదేవి విగ్రహాన్ని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టించి బంగారం, ముత్యాల ఆభరణాలతో అలంకరించారు. కుంకుమ పూజలు చేశారు. అంకుపాలెం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయడంతో ఆ కనకదుర్గమ్మే కళ్లముందు సాక్షాత్కరించినట్టుగా భక్తులు శరణుకోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వేడుకగా భవానీ దీక్షలు

బుచ్చెయ్యపేట : దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రాంభమయ్యాయి. పలు గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో దుర్గాదేవిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి ఆలయంలో వేలాది మంది భక్తులు మాలలు ధరించి నవరాత్రి దీక్షలకు దిగారు. సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల ఆలయంలో కలశ స్థాపనతో పూజలు ప్రారంభించారు. దుర్గాదేవిని బాల త్రిపుర సుందరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హోమాలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద కుంకుమ పూజలు చేశారు. బుచ్చెయ్యపేట దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు.

స్వర్ణాభరణ అలంకరణలో మాడుగుల దేవీతల్లి

మాడుగుల : రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన దసరా ఉత్సవాలు గురువారం స్థానిక దేవీ ఆలయంలో సివిల్ ఆర్‌టీసీ ఆటో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మోదకొండమ్మ ఆలయ కమిటీ సభ్యులు దేవీతల్లి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తొలిపూజలో పాల్గొన్నారు. దేవీతల్లిని వెండి, బంగారు నగలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈనెల 9న మూల విరాట్ పూజలు, 12న దసరా ఉత్సవంతో శరన్న నవారాత్రి ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ తెలిపింది.

వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో..

మాడుగుల రూరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున్న గల కనకదుర్గమ్మ ఆలయంలో కలశ స్థాపన, ఘటాల ఊరేగింపు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భవానీ భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు. ఈ నెల 6న ఆలయంలో చండీ హోమం, 12న ఆలయం వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. తొలిరోజు అమ్మవారిని సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు, జనసేన నాయకుడు కోన దుర్గా శ్రీనివాస్, సకలా సూరిబాబు దర్శించుకున్నారు. కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అమ్మవారికి అష్టలక్ష్మి కుంకుమ పూజలు ప్రారంభించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. అమ్మవారిని కె.జె.పురం పురవీధుల్లో ఊరేగించి కళావేదిక మీద ప్రతిష్టించారు.

కె.కోటపాడు : మండలంలో వారాడ, పింద్రంగి, ఎ.కోడూరు తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో దుర్గాదేవిని ప్రతిష్టించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పూజా కార్యక్రమాలను జరపనున్నట్లు వారాడ సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య తెలిపారు. వారాడలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు.

దేవరాపల్లి : మండలంలోని దేవరాపల్లి, సీతంపేట, నాగయ్యపేట, బోయిలకింతాడ, చిననందిపల్లి తదితర గ్రామాలలో దుర్గాదేవి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన మండపాలలో ప్రతిష్టించారు. మహిళల కోలాటం, భవానీ భక్తుల భజనల నడుమ అమ్మవారి విగ్రహాలు ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాలలో ప్రతిష్టించారు. గ్రామస్తులు, భవానీ భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

నర్సీపట్నంలో శరన్నవరాత్రి ఉత్సవ శోభ

నర్సీపట్నం : నర్సీపట్నం, బలిఘట్టంలో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాలు, పెదబొడ్డేపల్లి సరస్వతిదేవి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలను కౌన్సిలర్ రాజేష్, దివ్య దంపతులు ప్రారంభించారు. ఉదయం నుంచి ఆలయాల్లో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలమంది దుర్గమ్మ దీక్షలు చేపట్టారు. వెంకునాయుడుపేట, శివపురం తదితర ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

అయ్యన్న పాఠశాలలో దుర్గాదేవికి పూజ

కె.కోటపాడు : కె.కోటపాడు అయ్యన్న పాఠశాల విద్యార్థులు పాఠశాలలో దుర్గాదేవిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ విజయదశమి పర్వదిన విశిష్టతను వివరించడంతో పాటు బొమ్మల కొలువును ఏర్పాటు చేయించారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు నవదుర్గల వేషధారణలతో మహిషాసుర మర్దని కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఉత్సవాల తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు దర్శనమిస్తారని ఆర్.వై.అగ్రహారం మాజీ సర్పంచ్ చల్లా శకుంతల అన్నారు.

చీడికాడ : మండలంలో అప్పలరాజుపురం దసరా మెట్టపై వెలిసిన శ్రీ లలితాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. అమ్మవారిని గ్రామ సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు కుటుంబ సభ్యులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. భవానీ మాలాధారణ భక్తులతో ఆలయం వద్ద సందడి నెలకొంది. దసరా పర్వదినం రోజున పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

రోలుగుంట : మండల కేంద్రంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభించారు. దుర్గమ్మవారి ప్రతిమను వైభవంగా గ్రామంలో ఊరేగించి మండపంలో ప్రతిష్టించారు. భవానీ మాలధారులైన భక్తులు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొని భజన చేస్తూ మండపానికి చేరుకున్నారు. అమ్మవారిని ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. విజయదశమి వరకు అమ్మవారికి రోజూ విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మాకవరపాలెం: దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల దుర్గామల్లేశ్వర, తామరం కనకదుర్గ అమ్మవారి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిడుతూరు, జంగాలపల్లి, కోడూరు, మాకవరపాలెం, బయ్యవరం, తదితర గ్రామాల్లో ప్రత్యేక మండపాల్లో దుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్టించి పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు కనకదుర్గమ్మను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.



చీడికాడ : అప్పలరాజుపురంలో లలితాదేవిని దర్శించుకున్న సర్పంచ్ అప్పలనాయుడు



వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రోలుగుంట : దుర్గాదేవి ప్రతిమ ఊరేగింపులో భవానీలు



నర్సీపట్నం : ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



సీతంపేటలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భవానీ భక్తులు



నర్సీపట్నం : దుర్గాదేవిని దర్శించుకుంటున్న కౌన్సిలర్ రాజేష్ దంపతులు



కె.కోటపాడు : మహిషాసురమర్దని రూపాల్లో నవదుర్గల వేషధారణల్లో విద్యార్థినులు



మాకవరపాలెం : గిడుతూరులో దుర్గమ్మ మండపంలో పూజలు



బుచ్చెయ్యపేట : సీతయ్యపేటలో అమ్మవారికి జలాభిషేక పూజలు

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఉపాధ్యాయులకు దరఖాస్తులు అందజేస్తున్న తహసీల్దార్ రామారావు

నర్సీపట్నం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు పత్రాలను పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు దరఖాస్తులను తహసీల్దార్ రామారావు ఉపాధ్యాయులకు అందజేశారు. గోపీనాథ్ మాట్లాడుతూ నవంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2018 నవంబర్ నుంచి 2024 నవంబర్ మధ్యకాలంలో కనీసం మూడేళ్ల సర్వీసు సెకండరీ పాఠశాలలో పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులందరూ అర్హులన్నారు. తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాన్నారు. తహసీల్దార్‌కు దరఖాస్తులను అందజేసిన వారిలో మండల ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అల్లు అప్పారావు, రాష్ట్ర మహిళా అధ్యక్షుడు సునీత, ఆకుల కుమారి, చుక్కల రాము ఉన్నారు.

బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శికి సత్కారం



ఎం.అలమండలో పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ దాడి జగన్



సౌందర్యను దుశ్శాలువా వేసి పూలమాలతో సన్మానిస్తున్న సర్పంచ్ సందీప్, తదితరులు

కె.కోటపాడు : ఉద్యోగ నిర్వహణను అంకిత భావంతో నిర్వహించే వారిని ప్రజల మన్ననలు ఎల్లపుడూ ఉంటాయని సర్పంచ్ బోళెం సందీప్ అన్నారు. ఆర్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీల్లో బదిలీ అయిన సౌందర్యను సర్పంచ్, వార్డుమెంబర్లు, గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా, పూలమాలను అందజేసి జ్ఞాపికతో అభినందించారు. ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందించిన సౌందర్య పలువురు ఉద్యోగులకు స్ఫూర్తి అని సర్పంచ్ సందీప్ అన్నారు. కార్యక్రమంలో మాజీ పీఎంసీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని ఎం.అలమండ, ముషిడిపల్లి గ్రామ పంచాయతీల కార్యదర్శులకు బదిలీ కావడంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులు, ప్రజలు గురువారం ఘనంగా సత్కరించారు. ఎం.అలమండ పంచాయతీ కార్యదర్శి పి. శివ ప్రసాద్‌ను సర్పంచ్ దాడి జగన్, బండారు ప్రసాదరావు, పాలిపిరెడ్డి రమణ, ముషిడిపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డిని మతల మధు తదితర గ్రామ పెద్దలు, సచివాలయ అధికారులు ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలను అభినందించారు.

చెత్త నుంచి సంపద కేంద్రం ప్రారంభం



చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్

చోడవరం రూరల్: గవరవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశానుసారం స్వచ్ఛతా హీ సేవ పథకంలో భాగంగా గురువారం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ చప్పగడ్డి మాణిక్యం వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జె.సుందర్ సింగ్ మాట్లాడుతూ చెత్తతో వర్మీ కంపోస్టే కాకుండా ఎనర్జీ కూడా ఉత్పత్తి చేయవచ్చన్నారు.

మోదమాంబకు వెండి త్రిశూలం విష్ణుచక్రం సమర్పణ



ఆలయంలో వెండి త్రిశూలం, విష్ణుచక్రం అందజేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి శానాపతి గణేశ్, పడాల శ్రీనివాసరావు, నానుబిల్లి శ్రీనివాసరావుల సహకారంతో అరకిలో వెండితో తయారు చేసిన త్రిశూలం, విష్ణుచక్రంను సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు చేతుల మీదుగా గురువారం ఆలయ ప్రధాన అర్చకులకు అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రోలుగుంట: మండలంలోని ఏటిగైరంపేట సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.డి.వి.రామకృష్ణారావు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ వర్క్‌తోపాటు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నందున ఏటిగైరమ్మపేట ఎస్ఎస్ పరిధిలోని బెన్నభూపాల పట్నం , రత్నంపేట, ఆర్ల, గంగవరం, పనసలపాడు, పెందపేగ, చినపీలపేట, సింగరాజుపేట, చత్రాజీపురం, యర్రన్నపాలెం, మునగర్లపాలెం, వెంకటాపురం గ్రామలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కింతాడ ఫీడర్ పరిధిలో...

కె కోటపాడు : కె.కోటపాడు సబ్‌స్టేషన్ కింతాడ ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లు మెయింటెనెన్స్ పనుల నిర్వహణ నిమిత్తం ఫీడర్ పరిధిలో గల బొట్టవానిపాలెం, కింతాడ, కె.సంతపాలెం, జోగన్నపాలెం, చంద్రయ్యపేట,ఆర్లి, ఎరకన్నపాలెం గ్రామాల్లో పైన పేర్కొన్న సమయంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాంనగర్, ఇందిరా కాలనీ, రామారావుపేట, ఏఎస్ఆర్ నగర్, పాతలక్ష్మీపురం, రామలక్ష్మీపురం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కోరారు.

రిటైర్డ్ పోస్టుమాస్టర్‌కు ఘన సత్కారం



రిటైరైన తాతియ్యలు దంపతులను సత్కరిస్తున్న డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సాయిసంతోష్

నాతవరం : సమాజంలో ఎల్లప్పుడు గౌరవించే విధంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తే జీవనం అనందంగా సాగుతుందని నర్సీపట్నం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సాయిసంతోష్ అన్నారు. మండలంలో మర్రిపాలెం బ్రాంచి పోస్టు మాస్టర్‌గా పని చేస్తున్న నందిపల్లి తాతియ్యలు గురువారం పదవీ విరమణ చేయడంతో స్థానిక కల్యాణ మండపంలో సత్కార సభ ఏర్పాటు చేశారు. తాతీయ్యలు 42 ఏళ్ల పాటు పోస్టల్ డిపార్టుమెంటులో పనిచేసి సహోద్యోగుల్లో ఎంతో స్ఫూర్తి నింపారన్నారు. అనంతరం తాతియ్యలు దంపతులను ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు, నాతవరం మండల పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సంగీతకుమార్, నర్సీపట్నం విశాఖ డెయిరీ మేనేజర్ సత్యనారాయణ, గోపాల మిత్రలు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, పోస్టల్ మేనేజరు లాజర్, మాజీ సర్పంచ్‌లు స్వామినాయుడు, వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ మాణిక్యం పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నర్సీపట్నం : సస్యరక్షణ చర్యలతో వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చనని ఏడీఏ శ్రీదేవి రైతులకు సూచించారు. మండలంలో వేములపూడి, బలిఘట్టం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులకు వరిలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. వరిలో పొటాష్ లోపం ఉందని, దీనిని అధిగమించేందుకు ఎకరానికి 35 కిలోల పొటాషియం వేసుకోవాలన్నారు. ఎంపీటీసీ రాంప్రసాద్, పాల్గొన్నారు.

చీడికాడ: ఖండివరం, ఎల్.బి.పట్నం, గ్రామాల్లో గురువారం పోలం పిలుస్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయాధికారి రమాదేవి రెండు గ్రామాల్లో వరిలో ఆకుముడత, పొడ తెగులు, నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు.

కె. కోటపాడు : పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వి.సంతపాలెంలో మండల వ్యవసాయాధికారి ఎం.సోమశేఖర్ గురువారం పంట పొలాల్లో రైతులకు సస్య రక్షణ చర్యలు వివరించారు. వరిలో పొడతెగులు, ఆకుముడత, ఎండి తెగులు, అగ్గి తెగులు, మానిపండు తెగులు నివారణకు సూచనలు చేశారు. సర్పంచ్ లెక్క దేవిలత, ఉప సర్పంచ్ వెంకటరమణ, వీఏఏ పాల్గొన్నారు.

కొత్త వంగడాలతో అధిక దిగుబడులు



రైతులకు తెగుళ్ల నివారణపై సలహాలు అందిస్తున్న ఏవో వాసుదేవరావు, శాస్త్రవేత్త రాజుకుమార్ తదితరులు

మాడుగుల: కొత్త వంగడాలు సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని, వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. గురువారం ఎం.కోటపాడు, ముకుందపురం గ్రామాల్లో పొలం పిసుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు రైతులు పాత రకాలైన సాంబ, ఆర్‌జేఎల్, తదితర రకాలు మానుకుని కొత్త రకాలైన ఇంద్ర, అమర, మారుటేరు, సాంబ, శ్రీధృతి వంగడాలు సాగు చేయడం వల్ల తుపానులు, తెగుళ్ల తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని రైతులకు వివరించారు. కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు రాజుకుమార్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.